క్లుప్తంగా

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: చెత్తసేకరణలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని మూడవ వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గణపవరం(కర్లపాలెం): ఆపదలో ఉన్న అభాగ్యులకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి చేయూతనందించాలని ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపీ పేర్కొన్నారు. గణపవరం దేవుడి మాణ్యం కాలనీలో పక్షవాతం వచ్చి కదలలేని స్థితిలో ఉన్న బాలుడి కుటుంబానికి రూ. 5 వేలు బాపట్ల ఆదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు బుధవారం అందజేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు శ్రీరామ్ సునీల్, గోపి, అశోక్‌కుమార్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, అంకమరావు, రాజారమేష్, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రజా ఉద్యమాల్లో బెజ్జం పాత్ర కీలకం



బాపట్ల: ప్రజా ఉద్యమాల్లో బెజ్జం శ్రీనివాసరావు పాత్ర ఎంతో కీలకమని న్యూ డెమోక్రసీ నాయకుడు మేకల ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శిగా పని చేసిన బెజ్జం శ్రీనివాసరావు 6వ వర్ధంతి సభ స్థానిక కొల్లా వెంకయ్య కాలనీలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బెజ్జం శ్రీనివాసరావు ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళి అర్పించిన వారిలో ఎస్.విష్ణు, మువ్వల రాఘవులు, పల్లవి, ఎంపీ రంజాన్ ఉన్నారు.

బియ్యం, నూనె వితరణ



చెరుకుపల్లి: హిందూ ముస్లిం ఒక్కటే అని గుళ్లపల్లి గ్రామానికి చెందిన ముస్లింలు మరోసారి రుజువు చేశారు. గ్రామంలో అయ్యప్పలు, భవాని దీక్ష మాలధారులకు గుళ్లపల్లి నాగ్ యూత్ కమిటీ, అనగాని యువ సేన ఏర్పాటు చేసిన 40 రోజుల సద్ది కార్యక్రమానికి మీర్జా అజముద్దీన్ 50 కేజీల బియ్యం, 15 కేజీల నూనె డబ్బా బహూకరించారు. షాజాద్, బాజి, రఫీ, కాటూరి ఏడుకొండలు, వంగర శ్రీనివాసరావు, వంగర చక్రవర్తి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

భట్టిప్రోలు: నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత మండలంలో విచ్చల విడిగా, బహిరంగంగా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. 5 మద్యం దుకాణాలకు అనుమతులు లభించాయి. ఈ అమ్మకాలను కూటమి పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు ధీమాగా నిర్వహిస్తున్నారు. ఐలవరం, భట్టిప్రోలు, వెల్లటూరు, పెదపులివర్రు, గొరిగపూడి, ఓలేరు, చింతమోటు, పల్లెకోన గ్రామాల్లో ఈ బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. ఈవిషయమై రేపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఆర్.దివాకర్‌ను వివరణ కోరగా గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై నిఘా పెట్టినట్లు తెలిపారు. అక్రమంగా ఎవరైన మద్యం విక్రయాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎలుకల నివారణపై దృష్టిసారించాలి

రేపల్లె రూరల్: సాగులో రైతులు ఎలుకలతో కొంత నష్టపోతున్నారని మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు అన్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి, ఉప్పూడి, కామరాజు గడ్డ సచివాలయ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. యాంత్రిక పద్ధతుల్లో భాగంగా పొలాల్లో ఎలుక బోనులు, బుట్టలు ఉపయోగించి పైరు తొలిదశలోనే ఎలుకలను నియంత్రించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆర్.విజయ్‌బాబు, పంచాయతీ సెక్రటరీలు డి.పుష్పకుమారి, సీహెచ్ అనూష, వీఆర్‌వో వెంకటేశ్వర్లు, వీఏఏలు రాయల్ బాబు, ప్రసాద్, హిమబిందు, ఆషా, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు. మోళ్ళగుంట, తుమ్మల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ విజయబాబు నిర్వహించారు.

చెత్త సంపదలే కాదు అనారోగ్యాన్ని సృష్టిస్తుంది. పట్టణాల్లో మునిసిపల్ సిబ్బంది దాన్ని తడి–పొడిగా సేకరించినా తుదకు దాన్ని ఎక్కడకు తరలించాలో అక్కడికి చేర్చకపోతే సమస్య జఠిలం అవుతుంది. ఆంధ్రాప్యారిస్ పేరుతో వెలుగొందిన ఈ పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ చెత్త స్థానికులకు పెద్ద సమస్యగా మారింది.



ఐఎంఎల్ డిపో ఎదురు రోడ్డులో ఉడా కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్ప

పారిశుద్ధ్యం పడకేసింది!

- పట్టణ పారిశుద్ధ్యానికి దశాబ్దం క్రితం జాతీయస్థాయి గుర్తింపు
- శివారు ప్రాంతాలు, మురికివాడల్లో పరిస్థితులు అధ్వానం
- పట్టించుకోని అధికారులు

తెనాలిరూరల్: పారిశుద్ధ్య నిర్వహణలో రాష్ట్రంలోనే ముందంజ.. జాతీయస్థాయి గుర్తింపు.. ఓపెన్ డెఫికేషన్‌లోనూ గుర్తింపు.. చెత్త నుంచి ఆదాయం పొందడంలోనూ లేనిపోటీ.. ఇవీ అధికారులు, పాలకులు తెనాలి పురపాలక సంఘం గురించి పదేపదే చెప్పే మాటలు. వాస్తవంలో కేవలం కొన్ని ప్రాంతాల్లోనే పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చి పాలకులు, అధికారులు ఆహా.. ఓహో.! అనిపిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, మురికి వాడల్లో పరిస్థితులు అధికారులు, పాలకుల ప్రకటనలకు భిన్నంగా ఉంటున్నాయి. స్వచ్ఛతాహీ సేవ వంటి కార్యక్రమాలు సైతం పట్టణంలో సత్ఫలితాలనివ్వకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న విమర్శలు లేకపోలేదు.

రెండుబుట్టల విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని పురపాలక సంఘం తరపున అనేక రాష్ట్ర, జాతీయస్థాయి వేదికలపైనా అధికారులు ప్రకటనలు చేశారు. వాస్తవంలో ఇది ఆచరణలో లేదు. ఎక్కడికక్కడ కలెక్షన్ పాయింట్ల పేరిట చెత్తను పోగేసి పట్టణాన్ని చెత్తకుప్పగా మార్చుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని 40 వార్డులకు గాను ఉన్న 44 మురికివాడల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయనే చెప్పాలి. మారిస్‌పేటలోని రెండు గేట్ల మధ్య ప్రాంతంలో పాత పసుపు మిల్లు వద్ద చెత్తను వేస్తున్నారు. ఉడా కాలనీలో ఐఎంఎల్ డిపో ఎదురు ప్రధాన రోడ్డు వెంబడి చెత్తకుప్పలు దర్శమిస్తున్నాయి. కొత్తపేటలో పాత ఇన్‌కంటాక్స్ కార్యాలయం సమీపంలో.. ఇలా ఒక ప్రాంతం అనే కాకుండా పట్టణమంతా ఇదే సమస్య ప్రజలను పట్టి పీడిస్తోంది. చెత్తను డంప్ చేసేందుకంటూ గతంలో కట్టిన తొట్టెలు పందులకు నిలయాలుగా మారాయి. రాను రాను దిగజారిపోతున్న పారిశుద్ధ్య నిర్వహణ వల్లే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.



రైల్వేస్టేషన్ పశ్చిమ ద్వారం వద్ద పురపాలక సిబ్బంది వేసిన చెత్త కుప్ప

కలెక్షన్ పాయింట్లు ఎందుకు?

పట్టణంలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించేందుకు నగర దీపికల వ్యవస్థనూ ఏర్పాటు చేశారు. సేకరించిన చెత్తను ఆటోలు, ట్రాక్టర్లు, లేదా కాంపాక్టర్ ద్వారా నేరుగా కంపోస్టు యార్డుకు తరలించవచ్చు. అయినా కలెక్షన్ పాయింట్ పేరిట చెత్తను ఓ చోటకు చేరుస్తున్నారు. పాత స్వారాజ్ టాకీస్ వెనుక ముత్తెంశెట్టి పాలెం వెళ్లే రోడ్డు వెంబడి పురపాలక సంఘమే డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా కలెక్షన్ పాయింట్‌గా మార్చింది. ఈ మార్గంలో ప్రయాణించే స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల దీనిపై ఫిర్యాదు రావడంతో కలెక్షన్ పాయింట్‌ను తొలగించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తున్నప్పుడు చెత్తకుప్పలు పట్టణంలో ఎందుకు దర్శనమిస్తున్నాయో ఎవరికీ అర్థం కాని ప్రశ్న.

తెనాలి రైల్వేస్టేషన్‌కు పశ్చిమ వైపు ప్రవేశ ద్వారం వద్ద చెంచుపేట, సుల్తానాబాద్, పాండురంగపేట ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను వారం రోజుల కుప్పైగా వేశారు. తీవ్ర దుర్గంధంతో స్టేషన్‌కు వెళే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఒక విధంగా పురపాలక సంఘమే చెత్తను రోడ్డుపై వేయమని ప్రజలకు నేర్పుతున్నట్లయ్యింది. ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నప్పుడు ఇలా కలెక్షన్ పాయింట్లు ఎందుకన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచి సమస్యలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కాంపాక్టర్‌కు మరమ్మతు

చెత్తను కంపోస్టు యార్డుకు తరలించే పురపాలక సంఘ కాంపాక్టర్ మరమ్మతులకు గురైంది. దీని వల్ల చెత్తను తరలించే విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీని కోసం టెండర్లు పిలిచాం. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం.

–హెలెన్ నిర్మల, ఆరోగ్యాధికారి

మార్పులకు అనుగుణంగా నడుచుకోండి



వెబ్ ఎక్స్‌లో పాల్గొన్న ఎంఈవో జయంతి బాబు, ప్రధానోపాధ్యాయులు

విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్

తెనాలిఅర్బన్: విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నడుచుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి వెబ్ ఎక్స్ (వీడియో కాన్ఫరెన్స్)ను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో తెనాలి పరిధిలోని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయ, వి.జయంతి బాబు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్స్ కాంప్లెక్సల రీ ఆర్గనైజేషన్, అపార్, పేరెంట్–టీచర్స్ కమిటీల సమావేశాలు తదితర అంశాలపై ఆయన సూచనలు చేసినట్లు ఎంఈవోలు తెలిపారు.

వంతెనపై మొరాయించిన లారీ

తెనాలిరూరల్: ఓవర్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి ఓ లారీ మొరాయించింది. చెంచుపేట వైపు నుంచి పట్టణంలోకి వస్తున్న లారీ డీజిల్ అయిపోవడంతో వంతెనపై నిలచిపోయింది. దీని కారణంగా వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.

సాయిబాబా మరణం ప్రజాస్వామ్యం చేసిన హత్య

సంస్మరణ సభలో విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవల్లి కృష్ణ



మాట్లాడుతున్న అరసవిల్లి కృష్ణ. వేదికపై రవిచంద్ర, బెన్‌హర్, విద్యాసాగర్

తెనాలి: ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించి, ఆదివాసీల విముక్తికి కృషిచేసిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం, ప్రజాస్వామ్యం చేసిన హత్యగా విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవల్లి కృష్ణ ఆరోపించారు. ఇందుకు ప్రతిగా ఉపా చట్టం కింద జైళ్లలో మగ్గుతున్న వేలాదిమంది విడుదల డిమాండ్‌తో ముందుకు రావాలని ప్రజాస్వామ్యవాదులకు సూచించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక, భారత్ బచావో, భిన్నస్వరాలు–తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభకు 'అరసం' కార్యదర్శి కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. అరసవల్లి కృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, దేశంలో చట్టాల తీవ్రత, బూటకపు ప్రజాస్వామ్యపు ఆధిపత్యం ఏదిశలో కొనసాగుతందోనని చెప్పేందుకు సాయిబాబా ఉదాహరణగా చెప్పారు. రాజకీయ విశ్వాసాలకు లోబడి పనిచేయటమే నేరంగా పాలకవర్గాలు పదేళ్ల పాటు ఆయన్ను జైలుపాలు చేశాయని చెప్పారు.

నిర్బంధ వ్యతిరేక వేదిక రాష్ట్ర నాయకుడు కె.రవిచంద్ర తన ప్రసంగంలో దేశంలోని గతంలోని ఎమర్జన్సీని మించిన అప్రకటిత ఎమర్జన్సీ నడుస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థలు ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నాయని అన్నారు. మావోయిస్టు ఆరోపణలతో ఆరువేల ఆది వాసీలు, ఉపా చట్టం కింద వందలాది మంది, నార్త్ ఈస్ట్, జమ్ముకశ్మీర్ ఉద్యమాల్లోని వారు ఎందరో జైళ్లలో మగ్గుతున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితి స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఎన్నడూ లేదన్నారు. ప్రశ్నించే సాయిబాబా గొంతును అణచివేశామని అనుకున్నా, ఆయన జీవితం భావి తరాలకు పాఠం కాబోతోందని రవిచంద్ర అన్నారు.

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ సాయిబాబా కేసులో మలుపులను చూశాక దేశంలో రాజ్యాంగం ఉందా? కోర్టులు పరిగణిస్తున్నాయా? అనే అనుమానం కలుగుతోందన్నారు. కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ తన ప్రసంగంలో, సాయిబాబా మరణం, మనం ఏవైపో తేల్చుకోవాల్సిన కర్తవ్యాన్ని నిర్దేశించిందని చెప్పారు.

ఆదివాసీల వైపా, వారి కాళ్లకింద భూమిలో గల ఖనిజ నిక్షేపాలను సామ్రాజ్యవాద శక్తులకు కట్టబెట్టాలని చూసే పాలకవర్గాల వైపా? మనమే తేల్చుకోవాలన్నారు. ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం రావాల్సి ఉన్నా, ఆ పరిస్థితి కనిపించటం లేదన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, సీపీఎం నాయకుడు కొల్లిపర బాబూ ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకుడు సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉమారాజశేఖర్, చావలి గోపాల్ పర్యవేక్షించారు.

బలవంతంగా రైతు బజారులోకి తరలింపు



చిరువ్యాపారులను పంపేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బాపట్ల: పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న చిరు వ్యాపారులను మున్సిపల్ అధికారులు తొలగించారు. కూరగాయాల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన రైతుల బజారులోనే కూరగాయాలు విక్రయాలు చేయాలంటూ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, శానిటరీ సిబ్బంది మార్కెట్ వద్ద ఉన్న తోపుడు బండ్లను తొలగించే పనులు చేపట్టారు. ఎప్పటి నుంచో మార్కెట్ వద్ద తోపుడు బండ్లు, నేల మీద కూర్చొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను అన్యాయంగా తొలగించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజారులో మాత్రమే అమ్మకాలు చేసుకోవాలని అధికారులు సూచించడం సరికాదని చిరు వ్యాపారులు చెబుతున్నప్పటికీ వారిన్ని బలవంతంగా తరలించారు.

విధి నిర్వహణలో లోపాలు రానివ్వద్దు

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



కార్మికులకు సూచలిస్తున్న ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. మారీసుపేటలోని శానిటేషన్ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం తెల్లవారు జామున ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరుకావాలని సూచించారు. అలాగే చెత్త సేకరణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం 23, 24, 32 వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ శానిటేషన్ సెక్రెటరీలు ఉన్నారు.

ఉపాధి హామీ పనులు సంతృప్తికరం

- మొక్కల పెంపకానికి స్థల అన్వేషణ
- సమీక్షా సమావేశంలో ఎంపీడీవో అత్తోట దీప్తి



మాట్లాడుతున్న అత్తోట దీప్తి

తెనాలి: ఉపాధిహామీ పనులు మండలంలో సంతృప్తికరంగా ఉన్నాయని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బీఎఫ్‌టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి వారం సమీక్షలో భాగంగా జరిగిన సమావేశంలో గత వారంరోజుల్లో ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటి? మండలంలో జరుగుతున్న పనుల తీరు ఎలా ఉందనే అంశాలపై సమీక్షించారు. గత వారంరోజుల టార్గెట్ రూ.1.24 లక్షలు కాగా, రూ.96 వేలు పూర్తి చేయగలిగినట్టు తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించి, ఆక్సిజన్ స్థాయి పెరిగేందుకు ప్రభుత్వం జపాన్ సాంకేతికతతో తీసుకొస్తున్న అధిక సాంద్రత ప్లాంటేషన్ కోసం మండలంలో 25 సెంట్ల నుంచి ఎకరం వరకు స్థలం అవసరమైందని చెప్పారు. అదే విధంగా పల్లెవనం పేరుతో మండలం యూనిట్‌గా కనీసం 25 సెంట్ల విస్తీర్ణంలో మరో నర్సరీని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. వీటికోసం స్థల అన్వేషణ జరుగుతుందని, మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లి ఫైనలైజ్ చేయటం జరుగుతుందని చెప్పారు. ఉపాధి హామీ పనుల గురించి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురిసి, భూమిపై వర్షపునీరు ఉన్నందున రెగ్యులర్ పనులకు ఆస్కారం లేదన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణాలు మాత్రం కొనసాగుతున్నాయని వివరించారు.

మహిళలపై దాడులు అరికట్టండి

సీఐటీయూ జిల్లా నాయకులు ప్రసాద్



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రసాద్, హుస్సేన్‌వలి

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగి పోయాయని, వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సీఐటీయూ తెనాలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై ప్రతిరోజు దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించటం బాధకరమన్నారు. ఇలాంటి ఘటనలలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు వారి రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. తెనాలికి చెందిన సహాన మృగాల దాడుల్లో మృతి చెందటం బాధాకరమన్నారు. పేద దళిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు స్వేచ్ఛగా రోడ్లపై తిరిగే పరిస్థితి రాష్ట్రంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దోషులపై ఎందుకు కఠినంగా వ్యవహరించటం లేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, నాయకులు జి.లావణ్య, పుష్ప, పావని, రత్నకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఒక పక్క ఇసుక గుట్ట, మరోవైపు ఆటో



అదే రోడ్డుపై మరోచోట ఇరువైపులా ఆటోలు, బైకులు

ఎవరిష్టం వారిది!

పట్టణ 14వ వార్డులోని మసీదు బజారులోని దృశ్యమిది. రోడ్డుపై ఒకచోట ఇసుక గుట్ట, రెండోవైపు ఆటో...అదే రోడ్డుపై మరోచోట ఇరువైపులా ఆటోలు, బైకులు పార్కింగ్ చేసి ఉండటాన్ని గమనించొచ్చు. వాహనదారుల సంగతటుంచి నడిచేందుకు కూడా పాదచారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఒక్కోసారి వరుసగా ఒకదాని వెనుక మరొకటి చొప్పున మూడు, నాలుగు ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. ఎవరితో ఏమంటే ఏం తంటానోనని స్థానికులు మౌనంగా ఉండిపోతున్నారు. అధికారులు కాస్త దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

– తెనాలి

సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు



పోతుమర్రు గ్రామ సభలో ఆర్డీఓ రాజలక్ష్మి

వేమూరు: భూ రీ–సర్వేలో సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి అన్నారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వంలో కొన్ని గ్రామాల్లో రైతుల పొలాలు రీ–సర్వే చేసినట్లు చెప్పారు. అందులో సవరణకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. రీ సర్వే రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, అమర్తలూరు, కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు హజరయ్యారు. తహసీల్దారు సుశీల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న పోలీసు సిబ్బంది

వేమూరు: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని విద్యార్థులకు ఎస్ఐ రవి కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల సంస్మరణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి విద్యార్థులకు స్క్రీన్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు చెప్పారు.